చావద్దు

ఇల్లు యింకో వంద గజాల దూరంలోవుంది. అరుగు మీద జనం కనిపించడంలేదు. ఏమయినా జరిగివుంటే జనం యింటి ముందు పోగయివుండేవారు. నేల కూడా బురదతో తడిగాలేదు.

ప్రాణం కొంత కుదుటపడింది. నూటయాభై మైళ్ళ దూరం నుంచి బిగబట్టిన భయం. యాభై గజాల దూరం నుంచి బిగబట్టిన ఊపిరి ఒక్కసారిగా సడలిపోయింది, హమ్మయ్య అనుకున్నాడు. రిక్షా గుమ్మం ముందు ఆగింది.

రిక్షా ఆగడం చూచి చుట్టుపట్ల యిళ్లవాళ్ళు అరుగులమీదకి వచ్చి చూస్తున్నారు. కొందరు తలుపుల వెనకనించి. మరి కొందరు కిటికీల అవతల నించి.

వాళ్ళు అలా చూడ్డం ఏమిటోలా వుంది. కొత్తగా వుంది. ఇంతకు ముందు అనేకసార్లు వచ్చాడు. అప్పుడు యిలా చూళ్ళేదు. యథాలాపంగా చూసి, కాస్సేపు సరదాగా ఆసక్తిగా నిలుచునేవారు. ఇప్పుడు సరదాలేదు. ఆసక్తి మాత్రం వుంది. దానితోపాటు జాలి కూడా.

వాళ్ళు అలా చూస్తోంటే మళ్ళీ భయంవేసింది. గుండె దడ దడ లాడింది. రిక్షా వాడికి డబ్బు లిచ్చి మెట్లు ఎక్కుతోంటే కాళ్ళు తడబడ్డాయి. ఊపిరి బిగపట్టాడు. తలుపు తట్టాడు.

ప్రభ వచ్చి తలుపు తీసింది. "రా బావా" అంది.

ఆమె పిలుపులో జీరలేదు. చూడగానే బావురుమనలేదు. ఓ నిమిషం ఆగిపోయినట్టు అనిపించిన గుండె మళ్ళీ కొట్టుకోవడం మొదలెట్టింది.

"మీ అక్కయ్య కెలా వుంది?"

"కొద్దిగా కోలుకుంది. హాస్పిటల్లో చేర్పించాం"

"ఇంతకీ జబ్బేమిటి?"

ప్రభ మాట్లాడలేదు. "అమ్మా నాన్నా హాస్పిటల్లోనేవున్నారు. స్నానం చేసి వెళ్ళువుగాని, కోటిగాడ్నిచ్చి పంపుతాను .... ఒరేయ్ కోటీ! భూషణం బావ వచ్చాడురా"

ప్రభ లోపలికి వెళ్ళిపోయింది. నాగభూషణం నడవాలోనుంచుండి పోయాడు. బిక్కు బిక్కుమంటున్నట్టుంది. గోడలు మౌనంగా నిల్చుని పరిశీలనగా చూస్తున్నట్టున్నాయి. ఎదురుగా నిల్చుని పలకరించకుండా జాలిగా చూస్తున్న బంధువుల్లా వున్నాయి. ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. మాటలురాని వెర్రిదానిలా దిగాలుగావుంది. ఆ మూల రేడియో. ప్రభ యింట్లో వుండి కూడా రేడియో అలా మూగ పోవడం ఆశ్చర్యంగానే వుంది. ఆమెకు పాటల పిచ్చి. ఎప్పుడూ వాగుతూ వుండాల్సిందే. సిలోనో, వివిధభారతో, మరోటో ఏదో ఒకటి.

కోటేశ్వర్రావు వచ్చి పలకరించాడు. చిన్నతనం. పలకరించడమే గాని పరామర్శించడం తెలీదు.

"మీ అక్కయ్యకి ఎలావుంది?"

"ఇప్పుడు బాగానేవుంది. పొద్దున్న వెళ్ళొచ్చాను" అన్నాడు ఆ అబ్బాయి.

ప్రభ నీళ్ళుతోడానని పిలిస్తే వెళ్ళి స్నానం చేసి వచ్చాడు

నాగభూషణం. కాఫీ కాచి పట్టుకొచ్చింది. తాగుతూ —

"నిన్ననే రజనీ ఉత్తరం రాసింది. అందులో కనీసం ఒంట్లో నలతగా వుంటోందని చూచాయగా కూడా ఏంలేదు. ఇంకో వారం పదిరోజుల్లో వీలు చూసుకుని తనని తీసుకెళ్లడానికి రమ్మంది. సరిగా రోజు తిరక్క ముందే యీ టెలిగ్రాం. ఏమిటంత జబ్బు? డాక్టరు ఏం చెప్పాడు? అన్నాడు నాగభూషణం.

"ఇప్పుడే వస్తున్నా.... పొయ్యిమీద పోపు మాడిపోతోంది" అంటూ లోపలికి హడావుడిగా వెళ్ళింది ప్రభ.

నాగభూషణం కాఫీ తాగేశాడు. ప్రభ వంటింటి పనిలో సతమత మౌతున్నట్టుంది, వంటింట్లోంచి గిన్నెల శబ్దం వినిపిస్తోంది. ఓ రెండు నిమిషాలు చూసి హాస్పిటల్‌కు వెళ్దామని లేచాడు. ప్రభతో చెప్తే "పదినిమిషాలు ఆగు బావా, తమ్ముణ్ణి దుకాణం దగ్గరకు పంపించాను, వచ్చేస్తాడు. వాణ్ణి తోడు తీసుకుని వెళ్దువుగాని" అంది.

"ఫరవాలేదులే నేను వెళ్ళగలను. వూరేం కొత్త కాదు కదా. ఏ హాస్పిటలో చెప్పు" అన్నాడు.

ఆమె హాస్పటల్ పేరూ, ఎక్కడ వున్నదీ మొదలైన వివరాలు చెప్పింది.

నాగభూషణం అరుగు దిగి వీధిలో కొచ్చాడు. ఇళ్ళ అరుగుల మీదవున్న వాళ్ళ చూపులన్నీ అతని మీదే వున్నాయి. కుళాయిదగ్గర ఆడవాళ్ళందరూ అతనివైపే కళ్ళార్పకుండా చూస్తున్నారు. గుసగుస లాడుతున్నారు. వాళ్ళు అలా పట్టి పట్టి చూడ్డం అతనికి యిబ్బందిగా వుంది. పెళ్ళాం లేచిపోయిన మొగుణ్ణో, పెళ్ళాం ఆత్మహత్య చేసుకున్న మొగుణ్ణో చూసినట్టు చూస్తున్నారు. ఏదైనా రిక్షా కనిపిస్తే

బావుణ్ను. ఒక్కటీ కాళీగా కనిపించడంలేదు. తలవంచుకుని నడుస్తున్నాడు. తప్పుచేసిన వాడిలాగా ఆ నడక అతనికే కష్టంగా వుంది. రోడ్డు చివరికి వచ్చాడు.

రిక్షా దొరికింది. హాస్పిటల్‌కి బేరమాడి, ఎక్కి కూచున్నాడు. తొందరగా పోనివ్వవోయ్ అని వాడికి చెప్పాడు.

ఎంతగా నచ్చ చెప్పుకున్నా మనసు అదిరి అదిరి పడుతోంది. రజనీకి ప్రమాదం తప్పి వుండొచ్చు. లేకపోతే ప్రభ అంతగా తాపీగా మెసిలేది కాదు. అలాటి ప్రమాదపరిస్థితేగాని వుంటే, రావడంతోటే హాస్పిటల్‌కు బయలుదేరదీసేది. కాని—

నాగభూషణం తేలిగ్గా గాలి పీల్చలేకపోయాడు. వీధిలో వాళ్ళ జాలి చూపులే అతన్ని భయపెడ్తున్నాయి. బావురు మంటోన్న యిల్లూ, గుసగుస లాడ్తోన్న వీధీ అతన్ని జడిపిస్తున్నాయి. ఊపిరికీ ఊపిరికీ మధ్య గతుక్కుమంటున్నాడు. ఆలోచనకీ ఆలోచనకీ మధ్య లేతాకులా అల్లల్లాడిపోతున్నాడు. రజనీని కళ్లతో చూసే వరకు మనసుకు అసహనమే. నిజాన్ని నమ్మలేని పిరికితనం జ్వరంలా ఆవరించింది. ఆలోచించే కొద్దీ జ్వరం మరింత తీవ్ర మౌతోంది. ఆ జ్వరతీవ్రతలోనే అతను ఒక్కసారిగా తుళ్లిపడ్డాడు. ఇంతకీ రజనీకి ఏమిటి జబ్బు?

ప్రభని అడిగినా చెప్పలేదు. ఏదో ప్రాణం మీదకి వచ్చే జబ్బేమో, ఏ విషజ్వరంలాటిదో, గుండె నొప్పో, సెర్బరల్ హేమరేజో.

నాగభూషణం ఆలోచించలేని వాడిలా రిక్షా వెనక్కు జారబడిపోయాడు. భయం భయంగా బితుకు బితుకుగా ఊపిరి పీల్చి వదులుతున్నాడు. రెప్పల్ని సాగదీసి అతికించినట్టు గట్టిగా కళ్లు మూసుకున్నాడు.

రిక్షా ఆగిపోయింది. కళ్లు తెరిచాడు. హాస్పిటలు.

రెండు మూడుచోట్ల వాకబు చేసి వార్డులోకి వెళ్లాడు. అత్తగారు కనిపించింది. బెడ్ మీద రజనీ దుప్పటి కప్పుకుని నిద్రపోతోంది.

"వచ్చేవా నాయనా" అంది అత్తగారు. ఆమె కంఠంలో జీర. ఆమె ముఖంలో దుఃఖం గూడు.

రజనీ కళ్లు తెరిచి చూసింది. నిద్రపోవడంలేదు. మేలుకునే వుంది. కళ్లు తెరిచి అలాగే చూస్తోంది. ఒకటే చూపు. పాడైపోయిన గడియారం ముల్లులాగ కదలని చూపు. ప్రాణం ఎగిరిపోతే నిలిచిపోయినలాటి చూపు. భయపెట్టే చూపు.

అతనికి భయం వేసింది. క్షణంసేపు గుండె దడదడలాడింది. అంతలోకే కుదుటపడింది. ఆమె పెదాలు కదులుతున్నాయి. అది కదలిక కాదు. అదురు. భూకంపం వస్తే నేల అదిరినట్టు. అడ్డుపెట్టిన మూత ఎగిరిపడుతున్నట్టు. గుండెల్లోంచి దుఃఖం గొంతులోంచి తన్నుకొస్తోంది గాబోలు పెదాల్ని ఎంత గట్టిగా బిగించినా నిలవడంలేదు. డయాఫ్రమ్‌లా అదిరిపోతున్నాయి. పట్టు సడలి అల్లల్లాడిపోతున్నాయి.

"ఎలా వుంది రజనీ .... నీ వొంట్లో యిప్పుడెలా వుంది?" నుదుటి మీద చెయ్యేసి ప్రేమతో జుత్తు నిమురుతూ అడిగాడు.

ఆమె రబ్బరు బుడగలా పేలిపోయింది. గండిపడి పొర్లిపోతోన్న వరదలాగ, విరుచుకు పడుతోన్న వెల్లువలాగ దుఃఖం పొర్లిపోతోంది. కళ్లనుంచి తెగిపోని ఒకే ధారగా కన్నీళ్లు. తలగడలో ముఖం దాచుకుని భోరున ఒకటేఏడుపు. పసిపాపలాగ వెక్కి వెక్కి ఏడుస్తోంది. ఎంత గట్టిగా తలగడకి నోటిని అదుముకున్నా ఏడుపు ఆగడంలేదు.

నాగభూషణం ఎంతగా ఆమెను సముదాయించినా ఆ ప్రవాహానికి అడ్డు కట్ట వేయలేకపోతున్నాడు. అతను ఊరడించే కొద్దీ ఆమెకు

మరింతగా దుఃఖం కట్టలుతెంచుకొని పొర్లుకొస్తోంది. ఊపిరి పీల్చడం కూడా మర్చిపోయి, ఒక్కొక్కప్పుడు దుఃఖాన్నే మింగేసి ఎక్కిళ్లు పడుతోంది. ఆమెను ఊరుకోబెట్టడం అతనికి చేతకాలేదు. ఆమె ఏడుపు చూస్తే అతనికీ కళ్ల నీళ్లు తిరుగుతున్నాయి. మాట కూడా సరిగా గొంతులోంచి రావడంలేదు. మాట మాటకీ గొంతు సరిచేసుకుని ఊరుకోబెడుతున్నాడు.

"ఏమిటండీ జబ్బు?" నాగభూషణం అత్తగార్ని అడిగాడు.

అతని అత్తగారు గచ్చుమీదే చతికిలపడి గోడకి జారవడి కొంగు అడ్డుపెట్టుకుని లోపల్లోపలే ఏడుస్తోంది. అతను అడిగిన ప్రశ్నకు అవిడ మరింతగా దుఃఖంతో కుళ్లిపోయింది.

వాళ్లను చూస్తుంటే నాగభూషణానికి గుండె నిలవడంలేదు. ఏ భయంకర వార్త వినాల్సి వస్తుందోనని అదిరిపోతున్నాడు. ప్రతి సెకనూ మీదపడబోయే పెద్దపులిలాగ అనిపిస్తోంది.

తను ఊహించినది నిజమే కావచ్చు, ఏ గుండె జబ్బో అయితే తన గతేమిటి? తన రజనీ తన కిక దక్కదా? తన ప్రాణానికి ప్రాణంగా మెలిగిన తన రజనీ తనను ఒంటరివాడ్ని చేసి వెళ్లిపోతుందా!?

నర్సువచ్చి కోప్పడింది. "ఏమిటండీ అవిడని అలాఏడిపిస్తున్నారు. అవిడ మనసు బాగా దెబ్బతింది. ఎవరో ఒకరు రావడం, అవిడని ఏడిపించడం - యిదేం బావుండలేదు. మీరు కాస్సేపు బయటికి వెళ్లండి" అంది నాగభూషణాన్ని వాళ్ల అత్తనూ చూసి.

"సిస్టర్! ఊరు నించి యిప్పుడే వచ్చాను. రజనీకి సీరియస్‌గా వుందని మామగారు టెలిగ్రాం యిస్తే వచ్చాను. ఇప్పుడు ప్రమాద మేమీ లేదు కదా. ఇంతకీ జబ్బేమిటో ఎవరూ చెప్పడం లేదు .... అవిడకున్న కంప్లైంట్ ఏమిటి సిస్టర్?"

"ఆయనేనమ్మా అల్లుడుగారు" అంది వాళ్లత్త.

"అలాగా, రండి డాక్టరుగారిని కలుసుకుందురుగాని. వివరంగా అన్ని విషయాలూ మాట్లాడుతారు" అంది ఆమె.

అలా అంటూ ఆమె చూసిన జాలిచూపు అతను భరించలేక పోయాడు. గుండె చేత్తో పట్టుకున్నట్టుగా నర్సు వెంట వెళ్లాడు. ఆమె అతన్ని బైట కూచోబెట్టి డాక్టరుతో మాటాడి వచ్చింది. ఆ తర్వాత అతన్ని తీసుకు వెళ్లి పరిచయం చేసింది.

నాగభూషణం రజనీ ఆరోగ్యం గురించి అడిగాడు.

"మరేం ఫర్వాలేదు. ఆవిడ కోలుకుంటున్నారు. ఆందోళన ఏం లేదనుకోండి. అయినా .... " డాక్టరు మధ్యలోనే ఆగిపోయి అతని వైపు చూశాడు.

'ఏమిటది' అన్నట్టుగా చూశాడు నాగభూషణం.

"చాలా ఘోరం జరిగిపోయింది. మీరు దాన్ని ఎలా తీసుకుంటారో తెలీదు. అప్సెట్ కాకుండా తాపీగా సానుభూతితో ఆలోచించాలి."

నాగభూషణం ఊపిరి బిగబట్టి "చెప్పండి" అన్నాడు.

"విజయదశమికి ఊళ్లో పందిళ్లు వేసి నాటకాలు వేస్తుంటారు కదండీ. చూద్దామని మీ ఆవిడ వాళ్ల తమ్ముడ్ని తీసుకుని వెళ్లిందట. తిరిగొస్తున్నప్పుడు కాలవదగ్గర స్టూల్‌కి వస్తోందని వాళ్లక్కయ్యని అక్కడే వుండమని చెప్పి గట్టు దిగాడట ఆ అబ్బాయి. రెండునిమిషాల్లో తిరిగి వచ్చేసరికి ఆవిడ అక్కడ లేదట. ఇల్లు దగ్గరే కదా వెళ్లి పోయిందేమోనని యింటికొచ్చి చూస్తే యింటి దగ్గరకీ రాలేదట. రాత్రిల్లా వెతికారట కాని దొరకలేదు. పొద్దున ఆ కాలవ గట్టున అయిలు మిల్లు పక్కన హౌస్కూలు కాంపౌండులో కొన ఊపిరితో

మూలుగుతోంటే వాచ్‌మన్ చూసి నలుగుర్నీ పోగేసుకొని హాస్పిటల్లో చేర్చాడు. ఆ తర్వాత మీ యింట్లో వాళ్లకి తెలిసింది. పందిళ్లు చూస్తున్నప్పుడు ఎవరో ముగ్గురు వ్యక్తులు కొంతదూరం వెనక వెనకే ఏడిపించారట. ఆ తర్వాత మళ్లా వాళ్లు కనిపించలేదట. బహుశా వాళ్లే యీ పని చేసుంటారు. కనిపించకుండా వెంటబడి సమయం చూసి మీద పడివుంటారు ...."

నాగభూషణం ఆలకిస్తున్నాడే గాని డాక్టరు చెప్తున్నదేం వినిపించడంలేదు. తన మనస్సు వికలమైనట్టు డాక్టరుకి కనిపించ కూడదని అతి ప్రయత్నంమీద నిగ్రహించుకునే ప్రయత్నం చేస్తున్నాడు. 'అలాగా .... ఐసీ ....' అని అతి సామాన్యంగా అనడానికి ప్రయత్నిస్తున్నా ఆ కంఠం అతనికే వింతగాఅనిపిస్తోంది. ఆలోచించే ఓపిక కూడా వున్నట్టు లేదు. మనసు మొద్దుబారి పోయినట్టుంది. చాలా నిర్లిప్తంగా ఆలకిస్తున్నాడు.

వార్డులోంచి పిలుపువస్తే డాక్టరు '.... మళ్లీ కలుద్దాం' అని లేచాడు. నాగభూషణం యివతలికి వచ్చాడు. ఎక్కడైనా ఏకాంత ప్రదేశంలోకి వెళ్లి కూచోవాలని వుంది. ఇలా అర్థాంతరంగా వెళ్లి పోవడం బావుండదని ఆగిపోయాడు. రజనీ దగ్గరకు వచ్చాడు. ఆమె యింకా వెక్కిళ్లుపడుతూనే వుంది. ఊరుకోమని చెప్దామనుకున్నాడు. ఎంత ప్రయత్నించినా నోటిలోంచి మాట బైటికి రావడంలేదు. మాట మాత్రమే కాదు కనీసం శబ్దం కూడా. మూగవాడిలాగ అయిపోయాడు.

ఇంత అకస్మాత్తుగా తనలో వచ్చిన ఈ మార్పును రజనీ గుర్తుపట్టకూడదని లాకర్ మీదున్న బత్తాయికాయ తీసివలుస్తూ అతిప్రయత్నంమీద మాటల్ని కూడగట్టుకున్నాడు. వలిచిన తొనల్ని ఆమెకు యిస్తూ, కూడగట్టుకున్న మాటల్ని అనబోయి ఏమీ అనలేక

పొడి పొడిగా "ఇంద .... యివి తిను" అని మాత్రమే అనగలిగాడు. అప్పటికే అతని కంఠం పూడుకుపోయింది. ఎవరో గొంతును పిడికిట్లో పట్టి బిగించేస్తున్నట్టు కీచుగా బైటపడ్డాయి మాటలు. ఇంకా నోరు విప్పితే మనసే బైటపడేట్టువుంది. మౌనంగా తొనల్ని ఒక్కటొక్కటిగా వలిచి, లోపలి గింజల్నితీసి ఆమెకుయిస్తున్నాడు. ఆమె అందుకోకపోతే అతనే ఆమె నోటిలో పెడుతున్నాడు. మధ్య మధ్య కళ్ళనీళ్ళు తుడుస్తున్నాడు. గాలికి తలవెంట్రుకలు మాటి మాటికీ నుదుటిమీదకు ఎగిరిపడుతోంటే వెనక్కు సర్దుతున్నాడు. రెండు మూడు అక్షరాల మాటలు పొడి పొడిగా అప్పుడప్పుడు మాట్లాడుతున్నాడు. ధారాళంగా మాట్లాడాలనుకున్నా సాధ్యంకావడలేదు.

మామగారు ఫ్లాస్కులో కాఫీయో, పాలో పట్టుకొని వచ్చారు. ఆయన పలకరిస్తే అతి కష్టంమీద మాటలు తడుముకుంటూ సమాధానం చెప్పాడు. ఆ తరువాత కూడా మామగారే మాట్లాడుతూవచ్చారు. అతను మాత్రం శ్రోతగానే వుండిపోయాడు.

భోజనానికి టైము అయ్యిందని, ఇంటికివెళ్లి భోంచేసి వద్దామని మామగారు పిలిచినా నాగభూషణం వెళ్లలేదు. వెళ్తే వీధిలో వాళ్లందరూ తనకేసి చూస్తారు. వాళ్ల చూపుల్ని తట్టుకోవడం యిప్పుడిక తనకి చేతగాదు. ఇంతకుముందు కొద్దిగానైనా భరించగలిగాడు. ఇప్పుడు అందరి ఎదుటికీ రావాలంటే సిగ్గుగావుంది. తల విరిచేసినట్టుగా వుంది. ఏదీ పట్టించుకోకుండా, ఎవరినీ చూడకుండా ధైర్యంగా వెళ్లే సాహసంలేదు. చూసీ చూడనట్టు చూసినా చూడలేదనుకునే నిర్లిప్తతా లేదు.

అందుకే అతను యింటికి వెళ్లలేకపోయాడు. చీకటిపడేవరకు హాస్పిటల్లోనే వున్నాడు. అక్కడ అంత సేపున్నా ఎక్కువగ మాట్లాడ

వలసిన అవసరం లేకపోయింది. నిద్రవచ్చినా రాకపోయినా రజనీ కళ్లు మూసుకుని పడుకునేవుంది.

నాగభూషణం రాత్రి బాగా చీకటిపడ్డాకగాని యింటికి వెళ్లలేదు. భోంచేద్దామని కూచుంటే అన్నం సరిగా సహించలేదు. పడుకుంటే నిద్రకూడా కరువైపోయింది. మనసునిండా అసహనం. ఆలోచనల నిండా అశాంతి. చింపిపారేసిన ఆలోచనలతో చెత్తకుండీలా వుంది మనసు. కాళ్లు తుడుచుకునే కొబ్బరిపట్టాలా పీచు రేగిపోయి వుంది. పూడుకుపోయిన కాలవలా ఆలోచనలు పొర్లిపోయి చిత్తడి చిత్తడిగా వుంది. తనమీద తనకే కోపం. తనకేసి తను చూసుకోవాలంటే సిగ్గు. తన జీవితంమీద అసహ్యం. తనమీద జాలి.

తన కళ్ల ఎదుటే ఒక బంగారు కల కరిగిపోయింది. ఎన్నో తీయని ఊహాలు పక్వానికి రాకుండా పులుపుకాయలుగానే రాలిపోయాయి. ఎంతో మధురంగా అమృతమయంగా పండించదలచిన బ్రతుకు పంట ఎందుకూ కొరగాకుండా పోయింది. బ్రతుకే పులిసిపోయింది. ఒక తియ్యని ఆలోచన, ఒక కమ్మని భవిష్యత్తు లేకుండా జీవితాంతం ఎలా గడపడం? హాయిగా ఆనందంగా ఒక చిరునవ్వైనా లేకుండా ఈ శిక్షేమిటి తనకు?

అతనికి తెలీకుండానే కన్నీరు చెంపలమీంచి జారిపోయింది.

ఆ రాత్రి అతను నిద్రపోనేలేదు.

ఉదయం హాస్పిటల్‌కి వెళ్లేప్పుడు బావమర్దిని పంపి యింటికే రిక్షా తెప్పించుకుని వెళ్లాడు. మధ్యాహ్నం భోజనానికి రాలేదు. హోటల్లో తినేసి వచ్చాడు. రజనీకి, అత్తగారికి కేరియరు వచ్చింది. రజనీ 'ఆకలిగాలేదు, తినలేను' అంటే "చూడు .... అసలే నీరసంగా వున్నావు. అన్నం తినకపోతే మరీ నీరసపడిపోతావు. తిను"

అన్నాడు.

ఆమెకు కళ్లనీళ్లు తిరిగాయి. రెండు మూడు బొట్లు టపటపా రాలిపడ్డాయి.

ఆమె ఎందుకు కళ్లనీళ్లు పెట్టుకుంటోందో అతనికి అర్థమైంది. ఇంతకు ముందు ఎప్పుడైనా ఆమె అన్నం తిననంటే దగ్గరుండి ప్రేమతో బుజ్జగించి, కబుర్లు చెప్పి మురిపించి, అభిమానంతో కోప్పడి చిన్నపిల్లలా ఆమెను బెల్లించి తనూ చిన్నపిల్లవాడై ఆమె అన్నం తినేవరకు వేధించుకుతినేవాడు. కూర్చున్న స్థలంలోంచి ఆమె లేవలేక పోతే బలవంతంగా చేతులమీద ఎత్తిపట్టుకొని లాక్కొచ్చేవాడు. అలా అతనిచేత ఎత్తించుకోవాలనే ఆమె భోంచేయనని అప్పుడప్పుడు మొరాయించేది.

ఆ దృశ్యాలే ఆమె కళ్లముందు తిరిగుండాలి.

నాగభూషణం కళ్లల్లోనూ అవే దృశ్యాలు.

దొరికిపోయిన దొంగలాగ నాగభూషణం ఆమె ముఖంలోకి చూడలేకపోయాడు. మెల్లగా లేచి ఆమెను మంచంమీద లేవనెత్తి కూచోబెట్టాడు. స్టూలు దగ్గరగా జరిపి టిఫిన్ కేరియర్ దానిమీద పెట్టాడు. "చూడు రజనీ! ఎలాగోలా హితవు చేసుకుని అన్నం తినాలి. లేకపోతే మరీ నీరసంగా వుంటుంది. తిను.... నువ్వు తినకపోతే నామీద ఒట్టే" అన్నాడు.

అతనికి ఒట్లుమీద నమ్మకంలేదు. అది ఆమెకూ తెలుసు. తను తనలాగ మాట్లాడలేకపోతున్నానని అతనికికూడా తెలుసు.

ఆమె ఎంగిలిపడి మానేసింది. ఆమెను మరిక బలవంతం చేయలేకపోయాడు.

సాయంకాలం వరకు అక్కడ వుండాలంటే నాగభూషణానికి

బోర్‌గా అనిపించింది. అలా వెళ్తానని చెప్పి దగ్గరలో సినిమా హాలు వుంటే మేటినీకి వెళ్లాడు. సినిమా చూసే మూడ్ కూడా లేదు. హాస్పిటల్లో పరాయివాళ్ళ ముందు కూచున్నట్టు కూచోవడం చాలా ఎబ్బెట్టుగా వుంటుంది. బైటికొచ్చి ఊళ్ళో పట్టపగలు తిరగాలంటే ఏమిటోలా వుంది. చీకటిపడేవరకు ఎలాగోలా గడపడం కావాలి.

హాల్లో కూచున్నాడేగాని ఆలోచనలు అక్కడలేవు. ఇంటర్‌వల్ వరకు ఏదోవిధంగా గడిపినా ఆ తర్వాత నిద్రపోయాడు. సినిమా విడిచిపెట్టాక ఎవరో నిద్రలేపితే లేచాడు. హోటల్లో కాఫీతాగి హాస్పిటల్‌లో ఓ పావుగంట వుండి యింటికి వెళ్లిపోయాడు.

రాత్రి మామగారితో మర్నాడు తాను వెళ్లిపోతానంటే మరో రోజు వుండమన్నారు ఆయన. మర్నాడు ఉదయం రజనీని యింటికి తీసుకొచ్చేస్తున్నారట. ఆ మరుసటి రోజు వెళ్లొచ్చన్నారు.

మర్నాడు ఉదయం రజనీని తీసుకురావడానికి మామగారితోపాటు నాగభూషణం కూడా హాస్పిటల్‌కు వెళ్లాడు. రిక్షా దొరక్కపోతే కొంత దూరం నడిచి వెళ్లక తప్పింది కాదు. తలవంచుకుని నడుస్తున్నాడు.

తెలిసిన వారెవరో వాళ్ల మామగారిని పలకరించారు. అమ్మాయి ఆరోగ్యం గురించి పరామర్శిస్తున్నాడు ఆ వ్యక్తి. వీధిమధ్య నిలుచుని మాట్లాడుతున్నారు.

నాగభూషణానికి తలకొట్టేసినట్టుగా వుంది. మెల్లగా తల పైకెత్తాడు. కుళాయినుంచి నీళ్ళుపట్టుకొస్తోన్న ఒకామె అతన్నే పట్టిపట్టి చూస్తోంది. అతను తల పైకెత్తి చూడ్డంతోనే చూపు తప్పించేసింది. అతను యిటుపక్కకు చూశాడు. అక్కడ యింటి అరుగుమీద కూచుని మాట్లాడుకుంటున్న యిద్దరు పెద్దమనుషులు, అంతవరకు అతనివేపే నిదానించి చూస్తున్నవారల్లా, అతను అటు

చూడ్డంతోనే మరోవైపు ముఖాలు తిప్పేశారు. నాగభూషణం తలెత్తి అటూ యిటూ చూస్తున్నాడు, అంతవరకు ఓ యింటి తలుపుదగ్గర నుంచుని చూస్తోన్న ఓ అమ్మాయి అతను చూస్తోంటే లోపలికి వెళ్ళిపోయి తలుపు వేసుకుంది. అక్కడనుంచి వాళ్ళు కదిలినప్పుడు నాగభూషణం తలవంచుకుని నడవలేదు. తలెత్తి అటూ యిటూ చూసుకుంటూనే వెళ్ళాడు.

హాస్పిటల్‌కి వెళ్ళాక డాక్టరుగారితో మాటాడి వస్తానని మామగారు డాక్టరు రూంకి వెళ్ళారు. నాగభూషణం నేరుగా వార్డులోకి వచ్చాడు.

రజనీ యింకా మంచంమీదే వుంది. అత్తగారు సామాను సర్దుతున్నారు. మంచం దగ్గరకు వచ్చాడు. రజనీ అటు తిరిగి పడుకునివుంది. "ఇంకా పడుకునే వుందేమిటి లేపి కూచోబెట్టండి. మావగారు డాక్టరుగారితో మాట్లాడ్డానికి వెళ్ళారు. రాగానే యింటికి వెళ్ళిపోవచ్చు" అన్నాడు నాగభూషణం అత్తగారితో.

"లేమ్మా .... లేచి కూచో అబ్బాయి వచ్చాడు" అంది. దగ్గర కొచ్చి లేవదీసి కూచోబెట్టింది. కూతురి చెక్కిళ్ళమీద కన్నీటి చారికలు వుంటే కొంగుతో తుడిచింది.

తడిసిన తలగడను నాగభూషణం చూశాడు.

"రోజల్లా యిలా ఏడుస్తూ కూచుంటే యిక ఆరోగ్యం ఏం బాగుపడుతుంది".

లాలనగా అనబోయిన అతని కంఠం కసురుకొన్నట్టు వినిపించింది అతనికే. ఆ వెంటనే మళ్ళీ "అలా ఏడవగూడదు రజనీ. ఏడిస్తే నీ ఆరోగ్యం మరీ పాడైపోతుంది" అన్నాడు.

ఆమె ఉబ్బిన కళ్ళతో కొద్దిక్షణాలు అతన్నే చూస్తూ వుండి పోయింది. చూస్తోన్న ఆమె కళ్ళల్లోంచి కన్నీరు జలజలా కారి

పోయింది. వాళ్లమ్మ మందలిస్తూ కన్నీరు తుడిచింది. అతను మౌనంగా చూస్తూ వుండిపోయాడు.

మావగారు వచ్చి వెళ్లిపోవడానికి టేక్సీ ఏర్పాట్లు చేస్తున్నారు. నాగభూషణం ఒకసారి డాక్టరును కలిసి చెప్పివద్దామని వెళ్లాడు.

'చూడండి నాగభూషణం గారూ! ఆవిడ విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి సుమండీ. ఆమె మనసుకు ఏమాత్రం బాధ కలిగినా తట్టుకోలేదు. చాలా వీక్‌గా వుంది. ఏవిధంగానూ ఆమెకు మనస్తాపాన్ని కలిగించకూడదు. ఆమె మనసుకు తగిలిన యీ గాయం మానేవరకు ఆవిడ రోగి కిందే లెక్క. ఆ విషయం యింట్లో వాళ్లంతా ఎప్పుడూ గుర్తుంచుకోవాలి' అన్నాడు డాక్టరు.

తలవూపి ఆయన దగ్గర సెలవుతీసుకుని వచ్చేశాడు.

టేక్సీలో యింటికి వస్తోంటే డాక్టరు చెప్పిన మాటలే అతని చెవుల్లో మాటి మాటికి వినిపిస్తున్నాయి.

డాక్టరు అలా ఎందుకు చెప్పాడో తను అర్థంచేసుకోలేక పోలేదు. ఆమె విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరించాలంటే అర్థం ఆమెకు బాధకలిగించొద్దని. ఎందువల్ల ఆమెకు బాధ కలుగుతుందో డాక్టరు చెప్పకపోయినా తనకు తెలుసు. ఆయన అలా వూహించడం అసహజమేమీ కాదు. తను ఒక సామాన్యుడు. రాగద్వేషాలకు అతీతం కాని అతిసామాన్యమైన మనసు తనది. ఇలాంటి మనసు ఉన్నతంగా ఎలా ఆలోచించగలుగుతుంది! తను ఒక మహాత్ముడిలాగ ఎలా ప్రవర్తించగలడు? ఏ ప్రత్యేకతా లేని, ఏ గొప్పతనమూ లేని అతి సాధారణమైన మామూలు మనిషి తను.

నాగభూషణానికి గత రెండు రోజులుగా మాటిమాటికి యిద్దరు వ్యక్తులు గుర్తుకొస్తున్నారు. వాళ్లను గురించి ఆలోచించడం అతనికి

యిష్టంలేకపోయినా వాళ్లు అస్తమానం గుర్తుకొస్తూనేవున్నారు. ఇప్పుడుకూడా గుర్తుకొచ్చారు.

అతని కళ్ళల్లో ఎప్పుడో చిన్నప్పుడు వాళ్ల వీధిలోవుండే రాములు కదిలాడు. రాములు ఓ అల్యూమినియం కంపెనీలో పోత పోసిన పాత్రి సామానులకు తరిమెన పెట్టే కార్మికుడు. తన భార్య మరొకరితో తిడుగుతోందని చావగొడితే, ఆమె పుట్టింటికి పారిపోయి రెండు నెలల తర్వాత వచ్చినప్పుడు ఏమీ జరగనట్టే అన్నీ మర్చిపోయి ఏలుకున్నాడు. రాములు మహాత్ముడు కాడు. మామూలు మనిషి.

నాగభూషణం రాముల్ని గురించి ఆలోచించాడు.

అతని కళ్ళల్లో మరోవ్యక్తి కూడా కదిలాడు. వాళ్ళ ఆఫీసులో లోగడ పనిచేసి మానేసిన వహీదున్నీసా బేగం భర్త అతను. వహీదున్నీసా కొంతకాలం క్రితం ఓ కేసులో చిక్కుకున్నట్టు ఆఫీసులో చెప్పుకున్నారు. పోలీసు రైడింగ్‌లో ఓ హోటల్లో పట్టు బడిందట. అప్పట్లో పోలీసులు ఆఫీసు చుట్టూ నాలుగైదుసార్లు తిరగడం చూసికూడా అదే సెక్షన్‌లో పనిచేస్తున్న ఓ యు.డి.సి ఆమెను పెళ్ళి చేసుకున్నాడు. వాళ్ళకు యిప్పుడు యిద్దరు పిల్లలు కూడా. ఆ యు.డి.సి హుస్సేనీ మహాత్ముడు కాదు. అతి సాదా వ్యక్తి.

నాగభూషణం హుస్సేనీ గురించి ఆలోచించాడు.

'రాములు, హుస్సేనీ తనలాటివారే. తనకన్నా అతి సామాన్యులే, కాని —'

నాగభూషణం ఆలోచనలు టేక్సీతోపాటు ఆగిపోయాయి,

గుమ్మం ముందు ఆగిన టేక్సీని, అందులోంచి దిగుతోన్న తనకేసి వీధి వీధంతా చూస్తున్నా నాగభూషణం ఆమెను రెక్క పట్టుకుని మెల్లగా మెట్లు ఎక్కించి లోపలికి తీసుకెళ్లాడు,

ప్రభ ఎదురొచ్చి పలకరిస్తే ఆమెను కావలించుకుని ఘొల్లున ఏడ్చేసింది రజని. ఎంతకీ ఆమె ఊరుకోకపోతే నాగభూషణమే కల్పించుకుని గదిలోకి తీసుకెళ్ళి మంచంమీద కూచోబెట్టాడు. జేబురుమాలతో ఆమె కన్నీటిని తుడిచాడు. ప్రభ రజనీకని కాఫీ పట్టుకొస్తే తనే అందుకుని చల్లార్చి ఆమెకు పట్టాడు.

ఆమె ఉలుకూపలుకూ లేకుండా అతను చేసే పరిచర్య నీళ్ళు నిండిన కళ్ళతో చూస్తూ, నిర్లిప్తంగా అతను చెప్పినట్టు చేస్తోంది.

ఆమె అలా చూస్తోంటే నాగభూషణానికి గుండె దేవినట్టుగా వుంది. ఎప్పుడూ కలకల్లాడుతూ కబుర్లు చెబుతూవుండే ఆమె చలాకీతనం యిప్పుడు లేదు. పాడైపోయిన రేడియోలా దిగాలుగా వుంది ఆమె. గూడు వొదిలిన పక్షిలా చిరునవ్వు ఎటో ఎగిరిపోయింది. కళ్ళల్లో వెలుగులు లేవు, మబ్బేసినట్టు మసకబారిపోయాయి. ఆగిపోయిన గోడగడియారంలా ఉందామె. క్షణం తీరికలేనట్టు ఏదో ఒక పని చేస్తూనేవుండేది ఎప్పుడూ. ఆ చైతన్యం, ఆ ఉత్సాహం యిప్పుడు ఏ మరలోనో చిక్కుకుపోయాయి గాబోయి. ఏ తుప్పుపట్టిన చక్రంలోనో ఘనీభవించిపోయి వుండాలి. ఆ రజనీకి ఈ రజనీకి ఎంత తేడా. అప్పుడామె వర్షాకాలంలో కొండవాగు. ఇప్పుడు ఎండిపోయి యిసకడొక్కల్లో దైన్యాన్నంతా నింపుకున్న వేసవి వాగు.

నాగభూషణం ఓ అయిదు నిమిషాలు ఆమె పక్కనే మంచం మీద కూచుని 'కాస్సేపు పడుకుని రెస్టు తీసుకో' అని చెప్పి వచ్చేశాడు. నడవాలో భోజనాల టైము వరకు న్యూస్‌పేపరు తిరగేస్తూ వుండిపోయాడు.

భోజనంచేసి ఈజీచైర్‌లో అలా జేరబడితే నిద్రపట్టేసింది. లేచేసరికి మూడయ్యింది. ముఖం కడుక్కుందామని తువ్వాలు గురించి

రజనీవున్న రూములోకి వెళ్ళాడు. మంచంమీద గోడకుజేరబడి ఏదో రాసుకుంటున్న రజనీ అతని అలికిడివిని చటుక్కున రాయడం ఆపేసి కాగితాన్ని తలగడకింద పెట్టేయడం నాగభూషణం చూశాడు గానీ, అట్టే పట్టించుకోలేదు. బాత్‌రూములో సబ్బుతో ముఖం రుద్దుకోబోతూ చటుక్కున ఆగిపోయాడు.

మనసులో ఏమూలో కదిలిన చిన్న ఆలోచన మనసంతా తరంగాలుగా చుట్టేసి అల్లుకుపోయింది. అతను సబ్బునీ, నీళ్ళ చెంబునీ అక్కడ పడేసి హడావుడిగా ఆమె గదిలోకి వచ్చాడు. ఆమె చేతిలో కాగితాలు లేవుగాని పెన్నుమాత్రం కేప్ తెరిచేవుంది. చేతిలోని పెన్నుని చాలా తాపీగా క్రిందపెట్టి పక్కన గ్లాసులో నీళ్ళుంటే తీసుకొని తాగింది.

నాగభూషణం తువ్వాలు పెట్టడానికి వెళ్ళినట్టుగా అక్కడ పడేసి చొక్కావేసుకుని యివతలకి వచ్చేశాడు. నడవాలోనే ఈజీచైర్‌లో న్యూస్‌పేపరూ, వారపత్రికా చూస్తూ వుండిపోయాడు. ఇంట్లో వాళ్ళు మధ్యాహ్నం కాస్సేపు ఓ కునుకుతీసి యిప్పుడే లేచి టిఫిన్లు చేసే ప్రయత్నంలో వున్నారు. మావగారు యింకా నిద్రలేవలేదు. కోటి మధ్యాహ్నం అసలు యింట్లోనే లేడు.

రజనీ బాత్‌రూమ్‌కి గాబోలు దొడ్లోకి వెళ్ళింది. ఆమె తిరిగి వచ్చేసరికి నాగభూషణం గదిలో తలదువ్వుకుంటున్నాడు. ఆమె మామూలుగా వచ్చి పడుకుంది. నాగభూషణం మంచంమీద కూచుని, అటు తిరిగి పోయివున్న ఆమెను తనవైపు తిప్పుకున్నాడు. ఆమె కళ్ళల్లోకి చూస్తూ -

"రజనీ రేపు ఉదయం నేను వెళ్ళిపోతున్నాను. నీవొంట్లో బాగా స్వస్థత చేకూరాక వుత్తరం రాస్తే వచ్చి తీసుకెళ్తాను. నీకు

తెలుసుకదా నేను ఒంటరివాడ్నని. నువ్వు లేకపోతే నేను పిచ్చివాడ్నయి పోతాను. నాకు శాశ్వతంగా దూరమై నన్ను పిచ్చివాడ్ని చేయనని చెప్పు. నువ్వేమీ తప్పుచేయనప్పుడు ఎందుకలా బాధపడతావు. చచ్చిపోదామనుకోవడం శుద్ధ తెలివి తక్కువ. అలాటి పిచ్చి పిచ్చి ప్రియత్నాలు చేయనని మాట యివ్వు. వొద్దు రజనీ! నువ్వా ప్రియత్నాలు చెయ్యొద్దు. అంత ఘోరంగా నన్ను శిక్షించొద్దు ...."

రజనీ తలగడ కింద చెయ్యిపెట్టి చూసింది. అక్కడవుంచిన కాగితం చేతికి తగల్లేదు. చివాల్న లేచి కూచుని తలగడ తీసింది. కాగితం లేదు. నాగభూషణం జేబులోంచి అసంపూర్తిగా రాసివున్న ఓ కాగితం తీసి ఆమె కళ్ళఎదుటనే ముక్కలుముక్కలుగా చించేసి కిటికీలోంచి అవతలకి విసిరేశాడు.

"ఈ వుత్తరం నేను చూసుండకపోతే ఏ రాత్రివేళో నువ్వు ...."

అతను యింకా మాట పూర్తిచేయలేదు. రజనీ భోరున ఏడుస్తూ అతని వొళ్ళో వాలిపోయింది.

***